ఏచూరి మృతికి సీఎం సంతాపం

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రగతిపర మేధావి సీతారాంను కోల్పోయామని సీఎం సిద్దరామయ్య విచారం వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి మృతి పట్ల గురువారం 'ఎక్స్' ద్వారా సీఎం సంతాపం తెలిపారు. ఆయన అసలైన ప్రజాప్రభుత్వ వాది అన్నారు. మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా లౌకికశక్తులను సమన్వయ పరచడంలో సుదీర్ఘకాలం పోరాటం చేశారన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపీఏ పాలనలో సామాన్య కనిష్ట కార్యక్రమం రూపకల్పనలో కీలక భూమిక పోషించారన్నారు. 'ఇండియా' కూటమి ఏర్పాటులోనూ ఆయన కీలకంగా వ్యవహరించారన్నారు.



గ్రామపంచాయతీ ఖజానాలు వెలవెల



- నిధుల కొరతతో పల్లెల్లో ఆగిన అభివృద్ధి
- పంచతంత్ర 2.0లో సాంకేతిక లోపం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందని సాయం
- పారిశ్రామిక వాడల్లోనూ ఆదాయం అరకొరే..

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పల్లెసీమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్లు విడుదల కావడం ఏటా తగ్గుముఖం పడుతోంది. మరోవైపు గ్రామపంచాయతీల్లో పన్నులు పెంచుకునే పరిస్థితి లేక పోగా ఉన్న ఖాతాలు సైతం తగ్గిపోతున్నాయి. దీంతో గ్రామపంచాయతీల ఖజానాలు వెలవెలబోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలతో ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు ఏటా కేటాయించాల్సిన నిధుల్లో కోత ఏర్పడుతోంది. చిన్నపాటి పనులు బోరుబావుల మరమ్మత్తులు, కొళాయిల రిపేరీ, మురుగు కాలువలు శుభ్రం చేయడం, వాటర్‌ట్యాంకర్లను శుభ్రం చేయడం వంటి పనులకు సైతం నిధుల కొరత వెంటాడుతోంది. దీంతో పంచాయతీ సిబ్బంది అభివృద్ధి పనులు చేయలేక, మరోవైపు ఒత్తిడితో పన్నులు వసూలు చేసే పరిస్థితి లేక తల్లడిల్లే పరిస్థితి నెలకొంది. 5,958 గ్రామ పంచాయతీలు ఉన్నా చాలా వాటిల్లో శాస్త్రీయ పద్ధతుల్లో పన్నుల వసూళ్లు కావడం లేదు. 1,32,46,076 ఆస్తులు మాత్రమే పన్నుల వసూళ్ల కేటగిరీలో ఉండేవి. ప్రస్తుతం 75 లక్షల ఆస్తులు పన్నుల కేటగిరీ నుంచి దూరమయ్యాయి. గ్రామపంచాయతీలో ఆస్తుల వివరాలను మాన్యువల్ సమీక్షకు ముందు, ఆ తర్వాత వేగవంతంగా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. గ్రామస్వరాజ్, పంచాయతీరాజ్ విభజన 2021 నిబంధనను సవరించి గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి అనుమతులు పొంది ఆరు నెలలు ముగిసినా అధికారులు వాటిని పాటించేజోలికి వెళ్లలేదు. దీంతో సాంకేతికంగా పన్ను విధించడం సాధ్యం కావడం లేదు.



పన్నుల వసూలే సవాలు..

రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో పన్నుల వసూళ్లు సవాల్‌గా మారాయి. సిబ్బంది, బిల్ కలెక్టర్‌లు ఇంటింటా పన్నులు వసూలు చేసేందుకు గతంలో బిల్‌బుక్కులను ఉపయోగించేవారు. ఇటీవల స్వైపింగ్ మిషన్‌లను సిబ్బందికి కేటాయించారు. వాటి ద్వారా సమగ్ర సమాచారం లేకపోవడం, పేర్లు తప్పులు ఉండడం వంటి కారణాలతో పన్నులు చెల్లించేందుకు పల్లె ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. రెండేళ్ల నుంచి పన్నుల వసూళ్ల వివరాలను పంచతంత్ర 2.0 ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకోసం ప్రైవేట్ బ్యాంకు పీఓఎస్ (స్వైపింగ్ మిషన్‌లను) సమకూర్చింది. అప్పటికప్పుడే రసీదు ఇస్తామని స్వైపింగ్ మిషన్‌లతో వెళ్లినా యజమానులు పన్నులు చెల్లించడం లేదు. పీఓఎస్ యంత్రాలు నాణ్యత లేకపోవడం, రసీదుల్లోని అక్షరాలు స్పష్టంగా కనిపించకపోవడం, ఖాతాదారుడి పేరు, ఈ-సొత్తు వంటి సమాచారం నమోదు కాకపోవడం వంటివి పన్నుల వసూళ్లకు ఆటంకంగా మారుతున్నాయి. ఈ-సొత్తు, రుణం వంటి అవసరమైన వివరాలు గ్రామపంచాయతీ కార్యాలయాలకు వచ్చే ఖాతాదారుల నుంచి వసూలు చేసుకోవాలిగానీ, ఆదాయం పెంచుకోవాలనే ఆలోచన లేకపోవడం కూడా పంచాయతీల ఆదాయానికి గండిపడుతోంది. పంచతంత్ర 2.0 సాఫ్ట్‌వేర్‌ను సంస్కరించడం, ఈ-సొత్తు ఆధారంగా పన్నులు పెంచడం, పన్నుల బకాయిలపై 5శాతం జరిమానా విధిస్తే పన్నుల వసూళ్లు పెరుగుతాయని పంచాయతీ ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.


పంచాయతీ వెబ్‌సైట్

గ్రామాల పరిధిలోకి రాని పరిశ్రమలు

సుమారు 28 లక్షల పరిశ్రమలు గ్రామపంచాయతీల పన్నుల పరిధి నుంచి బయటే ఉన్నాయి. పరిశ్రమలు విద్యాసంస్థలు, చక్కెర ఫ్యాక్టరీలతో పాటు వివిధ విభాగాలకు చెందిన చిన్నతరహా పరిశ్రమలు ఏటా లక్ష్యానికి మించి లాభాలు గడిస్తున్నాయి. పైగా వాటి విస్తరణ పెంచుకుంటున్నాయి. పంచాయతీల పరిధిలో మౌలిక సదుపాయాలు అన్నింటినీ సద్వినియోగం చేసుకుంటున్నా పైసా కూడా పన్ను చెల్లించడం లేదు. బెంగళూరు దక్షిణ, ఉత్తర తాలూకాల పరిధిలోనే ఇటువంటి పరిశ్రమలు 3వేలకుపైగా ఉండగా వారెవ్వరూ పన్నులు చెల్లించడం లేదని తెలుస్తోంది. పారిశ్రామికవాడలు పల్లె ప్రాంతాలకు అనుబంధంగానే ఉన్నా మౌలిక సదుపాయాలను వివిధశాఖలు కల్పించి ఉండడంతోపాటు, పారిశ్రామికవాడలు గ్రీన్‌జోన్ పరిధిలో ఉండడంతో గ్రామపంచాయతీలకు పన్నులు దక్కడం లేదు. గ్రామపంచాయతీల పరిధిలో దశాబ్దాలక్రితం నుంచి ఒకే విధమైన మూస విధానంతో పన్నులు వసూళ్లు చేస్తున్నారు. ఇటీవల కొన్నేళ్లలో ఇళ్లను ఇతరత్రా వ్యాపారాలు, దుకాణాల వంటి వాటికి అనుకూలంగా ఆధునిక పద్ధతుల్లో నిర్మించుకున్నారు. రోడ్లు, కాలనీలు ఇతరత్రా జనకూడళ్ల వద్ద దుకాణాలతోపాటు చిన్నపాటి పరిశ్రమలు, వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. అయినా పన్నులు పెరగలేదు. మాన్యువల్ సర్వే జరిపి ప్రతి ఆస్తిని సమగ్రంగా పరిశీలిస్తే తప్పనిసరిగా పన్ను పెంచేందుకు వీలుంటుంది. ఆస్తి పన్నుల రికార్డులు కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా నియమించాల్సి ఉంటుంది. బెంగళూరు పాలికె తరహాలో ఖచ్చితంగా పన్నులు వసూలు చేయాల్సి ఉంటుంది. 2022-23లో రూ.923.28 కోట్లు పన్నుల లక్ష్యం కాగా 818.49 కోట్లు మాత్రమే వసూలైంది. 2023-24లో రూ.1,453.17 కోట్లు డిమాండ్ కాగా 765.21 కోట్ల రూపాయలు పన్నులు సాధ్యమయ్యాయి. 2024-25లో 1665.83 కోట్లకు గాను ఐదు నెలల్లో రూ.429.61 కోట్లు మాత్రమే వసూలయ్యాయి.

పారిశ్రామిక మండలిలోనూ..



కర్ణాటక పారిశ్రామిక అభివృద్ధి మండలి పరిధిలో 240 పారిశ్రామిక వాడలు ఉన్నాయి. చిన్నపరిశ్రమల అభివృద్ధి మండలిలో 162 పారిశ్రామిక జోన్‌లు ఉన్నాయి. పరిశ్రమలపైకి 22శాతం మాత్రమే గ్రామపంచాయతీలకు పన్నులు అందుతోంది. విద్యాసంస్థలు, సిమెంటు, చక్కెర పరిశ్రమలు గ్రామపంచాయతీల పరిధిలో ఉన్నా వాటి యజమానులు ప్రముఖులు కావడంతో పంచాయతీలకు పన్నులు చెల్లించడం లేదు. పారిశ్రామిక వాడల్లో ప్రభుత్వం రోడ్లు, కాలువలు, విద్యుత్‌దీపాలు, నీరు వంటి సౌలభ్యాలు కల్పించినా గ్రీన్ కారిడార్ కారణంగా పన్నులు వసూలు చేయడం లేదు.





కాలిపోయిన దుకాణాలు, రోడ్లపై చెలరేగుతున్న మంటలు

నాగమంగల.. ఉద్రిక్తం


మీడియాతో కేంద్ర మంత్రి శోభాకరంద్లాజె

- వినాయక నిమజ్జనం వేళ భగ్గుమన్న పట్టణం
- రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు
- 20 దుకాణాలు, పలు వాహనాలు దహనం
- రంగంలోకి ఆర్‌పీఎఫ్
- 144 సెక్షన్ అమలు
- ఇది అనూహ్య ఘటన : హోం మంత్రి
- ఒక వర్గమే టార్గెట్ : ప్రతిపక్షనేత అశోక్ మండిపాటు

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం ఊరేగింపు వేళ తలెత్తిన వాగ్వాదం నిమిషాల వ్యవధిలోనే ఆగ్రహాలకు కారణమై నాగమంగల పట్టణం భగ్గుమంది. మండ్య జిల్లా నాగమంగలలో బుధవారం రాత్రి వినాయక నిమజ్జనం ఊరేగింపు సాగింది. మెయిన్‌రోడ్డులోని ఓ ప్రార్థనా మందిరం ముందు ఊరేగింపు వెళ్లే వేళ డీజే డ్రమ్ములు ఉపయోగించరాదని అభ్యంతరం తెలిపారు. ఇరువర్గాల యువకులు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. మండ్య సర్కిల్ వద్ద వినాయక విగ్రహంపై రాళ్లు పడడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను అక్కడనుంచి తప్పించే ప్రయత్నం చేశారు. ఇలా సాగుతుండగానే రాత్రి 10 గంటలకు అల్లరి మూకలు దుకాణాలకు నిప్పుపెట్టారు. పెట్రోల్ బాంబులను విసిరారు. ఓ గుజరీ దుకాణానికి నిప్పంటించారు. పక్కనే ఉన్న బైక్ షోరూంను ధ్వంసం చేశారు. ఇందులో ఉండే ద్విచక్రవాహనాలు కాలిపోయాయి. గార్మెంట్స్‌తోపాటు వివిధ వ్యాపారాలకు సంబంధించిన 20కి పైగా దుకాణాలకు మంటలు వ్యాపించాయి. స్థానికంగా ఉండే ఫైర్ ఇంజన్‌తోపాటు సమీప ప్రాంతాలనుంచి అగ్నిమాపక యంత్రాలను రప్పించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అల్లరిమూకలు లాంగ్‌లు, రాడ్‌లు, తల్వార్‌లు ఝళిపిస్తూ రోడ్డుపక్కన పార్కు చేసిన పలు వాహనాలను ధ్వంసం చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. పలుమార్లు లాఠీచార్జ్ చేశారు. జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి, జిల్లా అధికారి డాక్టర్ కుమార్ అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలను గురువారం ఉదయానికి రప్పించారు. నాగమంగల పట్టణమంతా నివురుగప్పిన నిప్పులా మారింది. మండ్య, మైసూరు ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున సాయుధబలగాలను రప్పించారు. అల్లర్లపై ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన పోలీసులు 150మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు 53మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ ప్రకటించారు.

కారకులపై కఠిన చర్యలు: సీఎం

అల్లర్లకు కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. అదనపు పోలీసు బలగాలను నాగమంగలకు పంపామన్నారు. గొడవకు కారకులైనవారు ఎవరైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ ఇదో ఆకస్మిక సంఘటన అన్నారు. పోలీసులు పటిష్టచర్యలకు సిద్ధమయ్యారన్నారు. మంత్రి జమీర్ అహ్మద్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ అధిక శబ్దం కారణంగానే వివాదం చెలరేగిందన్నారు. ఇటువంటి సంఘటనలు బాధాకరమన్నారు. సమన్వయంగా వేడుకలు జరుపుకోవాలన్నారు. రాజకీయాలకోసం విమర్శలు చేయరాదన్నారు.


కాలిపోయిన వాహనాన్ని పరిశీలిస్తూ..

పట్టణంలో 144 సెక్షన్

బుధవారం రాత్రినుంచే నాగమంగల వ్యాప్తంగా 144వ సెక్షన్‌ను అమలులోకి తెచ్చారు. ఈనెల 28వరకు నిబంధనలు అమలులో ఉంటాయని ప్రకటించారు. మరోవైపు తాత్కాలికంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. కాగా మా పిల్లలు అమాయకులని, సంబంధం లేనివారిని స్టేషన్‌కు తీసుకొచ్చారని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఇరువర్గాల వారు ఆందోళనకు సిద్ధం కావడంతో పోలీసులు వారిని చెదరగొట్టి పంపేశారు.

బీజేపీ నేతల సందర్శన

నాగమంగలలో జరిగిన దారుణ సంఘటనను స్వయంగా పరిశీలించేందుకు ప్రతిపక్ష నేత అశోక్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రతోపాటు సీటీ రవి, ప్రతాప్‌సింహ తదితరులు నాగమంగల చేరుకున్నారు. కాలిపోయిన దుకాణాలను, వాహనాలను పరిశీలించారు. బాధితులను ఓదార్చారు. ఒక వర్గానికి సంబంధించిన దుకాణాలను టార్గెట్ చేసుకుని నిప్పు పెట్టారని మండిపడ్డారు. రెండు రోజులకిందటే కొత్త గార్మెంట్స్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకోగా పూర్తిగా కాలిపోవడంతో కోటిన్నర రూపాయలకుపైగా నష్టం వాటిల్లింది. బాధితుడు దుకాణం వద్ద రోదిస్తూ కనిపించారు. కేంద్రమంత్రి కుమారస్వామి ఘటనపై స్పందిస్తూ పోలీసుల వైఫల్యంతోనే పరిస్థితి తీవ్రమైందన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామి ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేంద్రమంత్రిగా ఉండేవారు సమన్వయం చేయాలని, రెచ్చగొట్టేలా మాట్లాడరాదన్నారు. కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషి, శోభాకరంద్లాజె స్పం దించారు. ఓ వర్గం పనిగట్టుకుని హింసను ప్రేరేపించిందని మండిపడ్డారు. పట్టణంలో భారీ బలగాలతో పర్యవేక్షిస్తున్నారు.


కాలిపోయిన బైక్ షోరూంను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు


హెబ్బాళ్ ఫ్లై ఓవర్ పనులను పరిశీలిస్తున్న సీఎం

వారంలో గుంతలు పూడ్చండి

- పాలికె అధికారులకు సీఎం ఆదేశం
- నగరంలో సీఎం ఆకస్మిక పర్యటన


మెట్రో రైలులో సీఎంతో బాలిక కరచాలనం


బెంగళూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర వ్యాప్తంగా వర్షం కారణంగా ఏర్పడిన గుంతలను వారంరోజుల్లో పూడ్చాలని బీబీఎంపీ అధికారులను సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. ముడా కేసు కోర్టులో విచారణ సాగుతున్న తరుణంలోనే సీఎం సిద్దరామయ్య గురువారం ఆకస్మికంగా సిటీ రౌండ్స్ జరిపారు. హెబ్బాళలోని బీడీఏ ఫ్లై ఓవర్ పనులు, రింగ్‌రోడ్డులోని కరియణ్ణపాళ్య వద్ద ఉండే సర్వీస్‌రోడ్డులో డాంబరీకరణ పనులు, హెణ్ణూరు జంక్షన్‌లో రోడ్డు పనులను, కేఆర్‌పురం రైల్వేస్టేషన్ వద్ద పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మెట్రో ద్వారా విధానసౌధకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బెంగళూరు నగరంలో 12,878 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయని, పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయన్నారు. వీటిని వారం రోజుల్లో పూడ్చివేయాలని అధికారులను ఆదేశించామన్నారు. రోడ్ల మరమ్మత్తులకు వార్డుకు రూ.15లక్షలు చొప్పున గ్రాంట్లు విడుదల చేశామన్నారు. గుంతలు పూడ్చే ప్రక్రియ సాగుతోందన్నారు. 2023-24లో రూ.1700 కోట్లతో వైట్‌ట్యాపింగ్ రోడ్ల నిర్మాణం వేగవంతంగా సాగుతోందన్నారు. ఇదే సందర్భంగా మీడియా ప్రశ్నకు సమాధానంగా లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అమెరికా పర్యటనలో రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా మాట్లాడారంటూ బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తోందన్నారు. రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ వచ్చినవారు రాజ్యాంగాన్ని మార్పు చేయాలని ప్రయత్నించారన్నారు. వారికి నిరసనలు చేపట్టే నైతికత ఉందా అని ప్రశ్నించారు. అందరికీ విద్య, ఉద్యోగం అవకాశాలు లభించాలనే అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు.

అఖిలభారత వీరశైవ మహాసభ అధ్యక్షుడిగా శ్యామనూరు

- ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో ఏకగ్రీవం
- హ్యాట్రిక్ సాధించిన దావరణగెరె ఎమ్మెల్యే

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత వీరశైవ మహాసభ అధ్యక్షుడిగా దావణగెరె ఎమ్మెల్యే శ్యామనూరు శివశంకరప్ప మూడోసారి విజయం సాధించారు. అధికారికంగా ప్రకటించడమే మిగిలి ఉంది. మహాసభ అధ్యక్షుడిగా శ్యామనూరు మరోసారి నామినేషన్ దాఖలు చేశారు. బుధవారంతో నామినేషన్‌ల ప్రక్రియ ముగిసింది. ఆయన ఒక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. ఏకైక నామినేషన్ కావడంతో ఈనెల 29న జరగాల్సిన ఎన్నికల ప్రక్రియ సాధారణమైంది. వీరశైవ మహాసభ ముఖ్య ఎన్నికల అధికారిగా మాజీ ఐఏఎస్ అధికారి ఎంబీ ద్యాబేరి పని చేశారు. బుధవారం చివరిక్షణం దాకా నామినేషన్ దాఖలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఏకగ్రీవమైనట్లు అయ్యింది. వీరశైవ మహాసభకు ఐదేళ్లకోసారి ఎన్నికలు జరపడం ఆనవాయితీ. ఇప్పటికే రెండుసార్లు అధ్యక్షుడిగా శ్యామనూరు వ్యవహరించారు. ప్రస్తుతం ఏకగ్రీవం ద్వారా మరో ఐదేళ్లు ఆయన సారథ్యంలోనే వీరశైవ మహాసభ కలాపాలు జరుగనున్నాయి. ప్రస్తుతం శ్యామనూరు శివశంకరప్పకు 93 ఏళ్లు కాగా ఒకసారి ఎంపీగా, ఆరుసార్లు ఎమ్మెల్యేగా, పలుమార్లు మంత్రిగానూ పని చేశారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.88	1,622.46
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	24,776	2554
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	24,237	9,995
సామర్థ్యం (టీఎంసీలు)	101.30	68.50

ప్రజాస్వామ్య దినోత్సవ పోస్టర్ల విడుదల



పోస్టర్లను ప్రదర్శిస్తున్న మాతామంజమ్మ జోగతి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 12: అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్మీకి భవన్ ఆవరణలో బస్సులు, మైనింగ్ వాహనాలు, పారిశ్రామిక, వాణిజ్య సంస్థల వాహనాలపై 1000 పోస్టర్లను అంటించే కార్యక్రమాన్ని పద్మశ్రీ మాతా మంజమ్మ జోగతి ప్రారంభించారు. జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్ శరణప్ప ఎఎస్పీ నవీన్‌కుమార్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లాధికారి జలాలప్ప, జిల్లా షెడ్యూల్డ్ తరగతుల సంక్షేమ అధికారి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షాకేంద్రాల చుట్టూ నిషేధాజ్ఞలు

బళ్లారి సిటీ,సెప్టెంబరు 12:గ్రూప్ 'బి' పోస్టులకు కన్నడ భాషా పోటీపరీక్షలను కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెప్టెంబరు 14,15తేదీలలో నిర్వహిస్తుందని, పరీక్షా కేంద్రాల చుట్టూ 200మీటర్లలోపు ప్రాంగణాన్ని నిషేధిత ప్రాంతంగా ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. కేంద్రాల చుట్టూ 144సెక్షన్ అమల్లో ఉంటుందని పరీక్షా కేంద్రాల చుట్టూప్రక్కల 200మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు పనిచేయకుండా చూడాలన్నారు. అనధికార వ్యక్తులు, గుంపులు గుంపులుగా రాకుండా నిషేధం విధించారు. పరీక్షల పర్యవేక్షణలో ఉన్న సిబ్బందికి ఈ ఉత్తర్వులు వర్తించవని తెలిపారు.

జల్‌జీవన్ మిషన్ అమలుకు కృషి



మాట్లాడుతున్న పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ,సెప్టెంబరు 12: జిల్లాప్రజానీకం సహకారంతో జల్‌జీవన్ మిషన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్ శరణప్ప సూచించారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో గురువారం ఫీడ్ బ్యాక్ ఫౌండేషన్, గ్రామీణ తాగునీరు, జిల్లాపంచాయితీల ఆధ్వర్యంలో జల్‌జీవన్ మిషన్ అమలుపై నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టుపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. బెంగళూరు గ్రామీణ తాగునీరు. పారిశుద్ధ్య విభాగం డిప్యూటీ సెక్రటరీ జాఫర్ షరీఫ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పని చేస్తూ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకోవాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. ప్రాజెక్టులో లోపాలుంటే వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హెచ్‌ఆర్‌డీ కన్సల్టెంట్ జగదీశ్, గ్రామీణ తాగునీరు, పారిశుద్ధ్య విభాగం రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్స్ పాల్గొని జల్‌జీవన్ మిషన్ పథకం అమలుపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా జీపీపీ డిప్యూటీ సెక్రటరీ గిరిజాశంకర్, జీపీపీ చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వాగీశ్ శివాచార్య, జీపీపీ చీఫ్ అకౌంటెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వినోద్‌కుమార్ హాజరయ్యారు.

రైల్వే సమస్యలపై ఏఐడీవైఓ నిరసన

బళ్లారి సిటీ, సెప్టెంబరు 12: నగరంలో రైల్వే స్టేషన్ వద్ద గురువారం యూనియన్ యూత్ ఆర్గనైజేషన్ తరపున ఏఐడీవైఓ నిరసన తెలిపింది. ఈ నిరసనను ఉద్దేశించి జిల్లాధ్యక్షుడు పంపాపతి మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారతీయ రైల్వే క్రమంగా బలహీనపడుతోందన్నారు. దశాబ్దాలుగా భారతీయ రైల్వేని సామాన్య ప్రజల పన్ను డబ్బుతో నిర్మించి అభివృద్ధి చేశారన్నారు. ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ ఎత్తుగడలు రైల్వే ప్రయాణికులను వేధిస్తున్నాయన్నారు. ఈరోజుల్లో రైల్వేభద్రత ప్రధాన సమస్యగా మారిందన్నారు. జిల్లా కార్యదర్శి జగదీశ్ నమితల్ మాట్లాడుతూ దేశంలోని నలమూలలా వలస కూలీల సంఖ్య పెరుగుతోందన్నారు.సమస్యలను పరిష్కరించాలని బళ్లారి స్టేషన్ మాస్టర్ ద్వారా కేంద్ర రైల్వే మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

ఉసూరుమన్న ఉల్లి రైతు



- క్వింటాల్ రూ.25 వేల నుంచి 10 వేలకు పడిపోయిన ధర
- పెట్టుబడికూడా రాదని రైతుల ఆవేదన

బళ్లారి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉల్లిపాయను కోస్తే ఎవరికళ్ల వెంటయినా నీళ్ల కారుతాయి. కాని ఉల్లి కోయకుండానే పండించిన రైతు కళ్ల వెంట నీరు కారుతోంది. ఇందుకు కారణం ధరల మాయాజాలమేనని చెప్పవచ్చు. నెలరోజుల క్రితం ఉల్లి క్వింటాల్ ఏకంగా రూ. 25 వేలు పలికింది. అప్పుడు అది మంచి లాభసాటి ధర అని రైతులు భావించారు. కానీ ఉన్నట్లుండి ఉల్లి ధర తగ్గిపోయి రైతులను ఉసూరు మనిపించింది. ప్రస్తుతం కింటాల్ ఉల్లి రూ. 10 వేలకు పడిపోయింది. దీంతో తాము పెట్టిన పెట్టుబడి కూడా చేతికి తిరిగి రాకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

బళ్లారి, విజయనగర, కొప్పళ, చిత్రదుర్గం, జిల్లాల్లో రైతులు ఖరీఫ్‌లో ఉల్లి పంటను సాగు చేశారు. బోర్ల కింద ఉల్లిపంటను సాగుచేశారు. గతంలో ఉల్లికి ఉన్న రేటును దృష్టిలో ఉంచుకుని రైతులు ఈసారి కూడా మంచి రేటు వస్తుందనే నమ్మకంతో సాగు చేశారు. కానీ తీరా పంట చేతికి వచ్చాక రేటు సగానికి సగం పడిపోయింది. ప్రకృతి విపత్తులు, అతివృష్టి, తెగుళ్ల లాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని పంటలు సాగు చేశారు. ఎకరాకు పంట దిగుబడి 30 కింట్వాళ్ల వరకూ వస్తుందనుకున్నా కానీ దిగుబడి సరాసరి 15 నుండి 20 క్వింటాళ్లకు పడిపోయింది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బళ్లారి, చిత్రదుర్గం, మార్కెట్‌లో ఒకప్పుడు ఉల్లి ధర బాగా ఉండేది. కానీ గురువారం ఉల్లి మార్కెట్‌లో క్వింటాల్ ధర 10వేలకు తగ్గిపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. కొందరు రైతులు తగ్గిన ధరకు ఉల్లిని అమ్మకుండా నిల్వ చేయగా, మరి కొందరు రైతులు ఎంతకో ఒకంతకు అమ్మేసి వెళ్లిపోయారు. మొత్తం మీద ఖరీఫ్‌లో రైతులకు ధర తగ్గిపోవడంతో ఉల్లి నిరాశ మిగిల్చింది.

కమ్మసంఘం ఆధ్వర్యంలో గణపతి లడ్డూ వేలం



లడ్డూ, పూజాసామాగ్రి వేలం పాట పాడుతున్న దృశ్యం

సిరుగుప్ప, సెప్టెంబరు 12 : పట్టణ కమ్మసంఘం ఆధ్వర్యంలో గురువారం రూ.40 వేలకు వినాయకుని పెద్ద లడ్డూ వేలం పాడారు. సిరుగుప్ప పట్టణం కమ్మసంఘం అధ్యక్షులు జాలాది రాధాకృష్ణ ఆధ్వర్యంలో లడ్డూవేలం పాట సాగింది. పెద్ద లడ్డూను కిరణ్‌కుమార్, బంగారి కలసి రూ.40 వేలకు పాడగా, గణేష్ హుండీని రూ.16వేలకు పాడారు. డబ్బుల హారాన్ని స్పందన రూ. 6500లకు, చిన్న లడ్డూలను కుటుంబరావు రూ.9 వేలకు, శేషు రూ.8 వేలకు, గొట్టిపాటి ఝాన్సీ, హర్షిత రూ.7 వేలకు వేలం పాడారు. దినేష్, అనిల్, గిరి, సురేష్, కృష్ణకాంత్, రవి, సాయి, శివ, పూజాసామాగ్రిని రూ. 8 వేలకు వేలం పాడారు. అనంతరం మేళతాళాలతో డోలు డమరులతో తుంగభద్ర నదికి నిమజ్జనం కోసం బయలుదేరారు. కార్యక్రమంలో కమ్మసంఘం ఉపాధ్యక్షులు తాతినేని ప్రసాదరావు, కార్యదర్శి సత్యనారాయణ, పదాధికారులు ప్రసాదరావు, చౌదరి, మురళి, మాజీ అధ్యక్షులు కోనేరు గోపాలకృష్ణ, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

కాకర్లతోట ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే భరత్‌రెడ్డి
- రోడ్డుపనులకు భూమిపూజ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 12: నగరంలోని కాకర్లతోట ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. బళ్లారి నగరంలోని కాకర్లతోట వద్ద ఉండే ప్రధాన వంతెన నిర్మాణానికి, రోడ్డుపనులకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రూ.8 కోట్ల నిధులతో ఇక్కడ వంతెన నిర్మాణ పనులు చేస్తున్నామని తెలిపారు. కాకర్లతోట, గుగ్గరహట్టి, తదితర ప్రాంతాల ప్రజలకు ఈ వంతెన పనులు పూర్తయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. బళ్లారి బెంగళూరు రహదారి గుగ్గర హట్టి సమీపంలో ట్రాఫిక్ సమస్యగా మారుతోందని, ఈ కొత్త బ్రిడ్జి నిర్మాణం వల్ల ట్రాఫిక్ జామ్ తగ్గుతుందన్నారు. బళ్లారి సిటీ సెంటర్‌నుంచి కాకర్లతోట ప్రాంతానికి వెళ్లే ప్రజలకు కూడా ఇది ఉపయోగపడుతుందన్నారు. వంతెన పనులతో పాటు 5వ వార్డు రోడ్డు అభివృద్ధికి రూ.75లక్షలు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఈసందర్భంగా ఆయన 5వవార్డుకు చెందిన ప్రజల నుంచి వినతిపత్రం స్వీకరించారు. అంద్రాల్ ప్రాంతంలో రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు కూడా నగర ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మేయర్ ముల్లంగి నందీశ్, కార్పొరేషన్ సభ్యులు రాజశేఖర్ హద్లిగి, ప్రభంజన్‌కుమార్, రామాంజనేయులు, విజయ్, అనూప్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

ప్రతి ప్రాణికి జీవించే హక్కుఉంది

పద్మశ్రీ డాక్టర్ మాతా మంజమ్మ జోగతి

బళ్లారి సిటీ,సెప్టెంబరు 12: సృష్టిలో మనిషితో పాటు ప్రతి ప్రాణికి జీవించే హక్కు ఉందని, ఈహక్కును ఎవరూ తీసివేయలేరని పద్మశ్రీ డాక్టర్ మాతా మంజమ్మ జోగతి అన్నారు. నగరంలోని వాల్మీకి భవన్‌లో గురువారం సాంఘిక సంక్షేమ శాఖ, రాష్ట్ర రెసిడెన్షియల్ విద్యాసంస్థల సంఘం ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్త్రీ. పురుష మైనార్టీలకు సమాన హక్కులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఒక మహిళగా సమాజంలో ఎన్నో బాధలు, అవమానాలు అనుభవించానన్నారు. ఆడ,మగ అనే తేడా లేకుండా అందరికీ ఒకే జీవితం ఉంటుందని, దాన్ని కనుగొని ధైర్యంగా జీవితాన్ని నిర్మించుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ కోరికలను, ఆకాంక్షలను పక్కనపెట్టి త మ పిల్లల కోసం తమ జీవితాలను వృధా చేసుకుంటారని, వారిని మోసగించరాదన్నారు. సమయం విలువ పాటిస్తే, ఒక రోజు అదే సమయం పెద్దముత్యాన్ని చెల్లిస్తుందన్నారు.



మాట్లాడుతున్న మాతా మంజమ్మ జోగతి

జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ అనాటి విద్యకు, నేటి విద్యకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. తదుపరి ఉన్నత విద్యతో పాటు నైపుణ్య ఆధారిత విద్య అవసరం .కాబట్టి పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. లక్ష్యం సక్రమంగా ఉంటే సాధించగలరనడానికి మంజమ్మ జోగతి ఉదాహరణ అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు ఉన్నాయని, ఉపాధ్యాయుల వ్యక్తిత్వం విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బళ్లారి జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల సంక్షిప్త సమాచారంతో కూడిన స్మారక సంచికను ప్రముఖులు విడుదల చేశారు. కార్యక్రమంలో హంపి కన్నడ విశ్వవిద్యాలయం డైరెక్టర్ అమరేశ్ యాతగల్ ప్రత్యేక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నవీన్‌కుమార్,ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జగదీశ్ కనకాల, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా.అధికారి జలాలప్ప, జిల్లాషెడ్యూల్డ్ తరగతుల సంక్షేమాధికారి దివాకర్, మొరార్జీదేశాయ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్న కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసంరక్షణపై అవగాహన పెంచుకోవాలి



వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఐసీఏఆర్ అధికారి క్రిష్టారావు

బళ్లారి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యవసాయం సాగు, భూసంరక్షణ. నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. క్రిష్టారావు సూచించారు. గురువారం ఐసీఏఆర్ ద్వారా బళ్లారి సమీపంలోని శ్రీధరగడ్డ వద్ద ఉండే వ్యవసాయ ఉత్పత్తుల క్షేత్రాన్ని బసవరాజేశ్వరి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థులకు నీటి సంరక్షణ, వ్యవసాయంకు ఉపయోగించే వివిధ పరికరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యవసాయం సాగు పద్ధతులు ప్రాక్టికల్‌గా తెలుసుకోవాలని సూచించారు. డాక్టర్ బి. క్రిష్టారావుతోపాటు సాయిల్ శాస్త్రవేత డాక్టర్ ప్రభావతి, వ్యవసాయ అధికారి కేఎన్ రవి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గంలోనే వాహన రాకపోకలు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 12: నగరంలోని సుధాక్రాస్ సర్కిల్ నుండి ఓపిడి రోడ్డు వరకు రైల్వే ప్లైఓవర్ పనులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఈ మార్గంలో వాహన సంచారాన్ని తాత్కాలికంగా నిలిపి ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సార్వజనిక సురక్ష, సుగమ సంచార వ్యవస్థ కల్పించే ఉద్దేశంతో మోటారు వాహన చట్టం అమలు ప్రకారం ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. బళ్ళారి నగరంలోని ఎస్పీ సర్కిల్ నుండి హొసపేట వైపు వెళ్ళే పాఠశాల, కళాశాల, మెడికల్, అత్యవసర వాహనాలు మినహాయించి మిగిలిన వాహనాలు ఇన్‌ఫ్యాంట్రీ రోడ్డు, పోలో ప్యారడైజ్ హోటల్ ముందు ఉన్న రైల్వే 2-గేట్, ఐటిఐ కళాశాల మీదుగా హొసపేట రోడ్డువైపు వెళ్లాలన్నారు. పాఠశాల, వైద్య, అత్యవసర వాహనాలు మాత్రం విమ్స్ డైరెక్టర్ కార్యాలయం ముందు రోడ్డు గుండా కంటోన్మెంట్ రైల్వేగేట్ మార్గం గుండా వెళ్లవచ్చునన్నారు. హొసపేట నుండి బళ్ళారి నగరానికి విచ్చేసే అన్ని లఘు వాహనాలు ఆర్టీవో కార్యాలయం, కౌల్‌బజార్ 2వ గేట్ మీదుగా లేదా కౌల్ బజార్ 1వ రైల్వే గేటు ప్లై ఓవర్‌పై సంచరించవచ్చని వివరించారు. హొసపేట నుండి బళ్ళారి నగరం వైపు సంచరించే భారీ వాహనాలు, సరుకు రవాణా వాహనాలు కేవలం రాత్రి 11గంటల నుండి ఉదయం 6గంటల వరకు కౌల్‌బజార్ ప్లైఓవర్ ద్వారా నగరంలోకి వచ్చేందుకు అనుమతించారు. బళ్ళారి నుండి హొసపేట రోడ్డువైపు వెళ్ళే అన్ని రకాల వాహనాలు కౌల్ బజార్ 1వ రైల్వే గేట్ మీదుగా సంచరించవచ్చని తెలిపారు.

కనీస వేతనం ఇవ్వకపోతే 20 నుంచి నిరసన



మాట్లాడుతున్న కార్మిక సంఘం అధ్యక్షుడు రాజశేఖర్

కంప్లి, సెప్టెంబరు 12: కుడితిని వద్ద వున్న కేపీసీఎల్‌లోని బీటీపీఎస్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోతే ఈ నెల 20 నుండి కేపీసీఎల్ ముందు నిరసనలు ప్రారంభిస్తామని బీటీపీఎస్ కార్మిక సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. కార్మికుల కనిష్ఠ వేతనం విషయంపై గురువారం బీటీపీఎస్‌లోని డీజీఎం (ఎస్ఆర్‌డీ) వైబి హాలబావితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినా బీటీపీఎస్‌లో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై గత కొన్ని సంవత్సరాలుగా వారిని మోసం చేస్తున్నారన్నారు. టెండర్లో ఒక రేటు వుంటే కాంట్రాక్టర్లు ఇచ్చే వేతనాలు మరోలా వుందన్నారు. ఏ కార్మికుడైనా ఈ విషయాల ప్రస్తావన తెస్తే అలాంటి కార్మికులను విధుల నుంచి తొలగించడంతో పాటు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. కేవలం 26 రోజులకు మాత్రమే వేతనాలు ఇస్తున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి 20వ తేదీ లోపు కూలీ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే ర్యాలీ చేసి ధర్నాలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌డీ వైబి హాలబావి మాట్లాడుతూ ఈ విషయంపై శుక్రవారం వివిధ విభాగాల కాంట్రాక్టర్లు, అధికారులతో చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు వెంకటరమణ బాబు, కనికేరి పంపాపతి, పట్టణ ప్రముఖులు చంద్రయ్య దొడ్డ బసప్ప, దొడ్డప్ప, వెంకటేష్, ప్రతాప్, మాంతేష్, మంజు, తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామికి విశేష పూజలు



బళ్లారి రూరల్, సెప్టెంబరు 12 : బళ్లారి నగరంలోని కూల్ కార్నర్ సర్కిల్ సమీపంలో ఉన్న రాఘవేంద్రస్వామి ఆలయంలో గురువారం సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

హోసూరు జోన్

అంజనం మాయాజాలం.. 8 మంది అరెస్ట్



నిధులు వెతుకుతామని డబ్బు కాజేసిన దుండగులు

హోసూరు(క్రైం) సెప్టెంబరు 12:అంజనంవేసి నిధులు కనిపెడతామంటున్న ఇద్దరి మాటలువిని హోసూరు రాయకోటరోడ్డు ప్రాంతంలో నివసించే నాగరాజ్(50), భార్య గిరిజ(40) మోసపోయారు. మహారాష్ట్రకు చెందిన రామచందిరన్(45), రాకేశ్(22) నిధులు ఎక్కడున్నాయో తాము అంజనంతో కనిపెడతామని చెప్పడతో అందులో ఆసక్తి ఉన్న నాగరాజు వారికి డబ్బులు ఇచ్చి నిధిని కనుగోవాలని తెలిపారు. డబ్బు తీసుకుని మహారాష్ట్రకు వెళ్లి పోయిన వారు తిరిగి రాకపోవడంతో నాగరాజ్ వారికి ఫోన్‌చేసి మళ్లీ ఇంకో చోటు నిధి ఉన్నట్లు తెలిసింది, వారు కూడా డబ్బులు ఇస్తారని చెప్పి వారిని తిరిగి హోసూరుకు రప్పించాడు. వారు రాగానే నాగరాజు తన సహచరులతో కలిసి వారిని అదుపులోకి తీసుకుని డెంకణీకోట సమీపంలోని దెబ్బగుళి అనే ప్రాంతంల్లో ఉంచి చిత్రహింసలకు గురిచేసి డబ్బును తిరిగి ఇమ్మని ఒత్తిడి చేసినట్లు తెలిసింది. దీనిపై హోసూరు పోలీసులకు సమాచారం అందడంతో వారు గాలించి నాగరాజుతో పాటు ఆరుగురిని అదుపులోకి తీసుకుని కిడ్నాప్‌కు గురైన ఇద్దరిని రక్షించారు. దీనిపై నాగరాజ్ భార్య గిరిజ వారు తమ వద్ద నుంచి రూ. లక్ష కాజేశారని తమను మోసం చేశారని ఫిర్యాదు చేసింది. దీనిపైపోలీసులు రామచంద్రన్, రాకేశ్‌లతో పాటు 8 మందిని పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

దోమల నియంత్రణపై అవగాహన

హోసూరు, సెప్టెంబరు 12: చిన్నఎళసగిరిలోని వార్డుల్లో ఇంటింటికి వెళ్లి దోమల లార్వాల నిర్మూలన, ఇంటింటికి వాన నీటి సంరక్షణ గురించి అవగాహన కల్పించామని హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. చెన్నపళనియప్పన్ నగర్, కామరాజ నగర్, బాలాజీ నగర్, ప్రజలకు సరఫరా చేసే తాగునీటిలో క్లోరిన్ కలిపి వర్షాకాలంలో జ్వరాల నివారణకు కృషిచేస్తున్నామన్నారు. తనిఖీల్లో మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ ప్రభాకరన్, మెడికల్ అధికారి డాక్టర్ మంజునాథ్, శానిటేషన్ అధికారులు శరవణన్, అన్బళగన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్ వైజర్లు, నర్సులు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

వర్షాకాల ప్రమాదాలపై ముందస్తు సమావేశం

హోసూరు(కృష్ణగిరి) సెప్టెంబరు 12: కృష్ణగిరి జిల్లాలో వర్షాకాలం ప్రారంభం కానున్నందున, డివిజనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు, అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మోటారు పడవలు, పారాసైల్స్, హైఓల్టేజీ ల్యాంప్స్, మోటారు పంపు సెట్లు, డీజిల్ జనరేటర్లు, ఇసుక సంచులు, రెస్క్యూ తరలింపు కార్యక్రమాలు, అవసరమైన సంస్థల వివరాలను తెలుసుకొని, సర్కిళ్లల్లో స్పీకర్లతో కూడిన వాహనాల ద్వారా ప్రజలకు తగు ముందస్తు జాగ్రత్తలు తెలియజేయాలన్నారు, వరదల సమయంల్లో నీటి కాలుష్యం వల్ల అంటు వ్యాధులు ప్రబలకుండా స్థానిక సంస్థల ద్వారా నీటి పరీక్షలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎ.సాధనకురళ్, జిల్లా కలెక్టర్ జనరల్ పుష్ప, జిల్లా సరఫరా అధికారిణి గీతారాణి, సహాయ సంచాలకులు మహదేవన్, జిల్లా ఆరోగ్య అధికారి రమేశ్‌కుమార్, ప్రత్యేక జిల్లా కలెక్టర్ జైశంకర్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



వర్షాకాలం జాగ్రత్తలపై సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్

కోలాహలంగా గణేశ్ నిమజ్జనం



నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు

రాయచూరు సెప్టెంబర్ 12: నగరంలోని వివిధ మండపాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల నిమజ్జనం కోలాహలంగా సాగింది. ఐదవ రోజు పూజలు నిర్వహించి బుధవారం అర్ధరాత్రి నుంచి ఊరేగింపులు ప్రారంభించిన నిర్వాహకులు గురువారం సాయంత్రం వరకు వాటిని కొనసాగించారు. ఈ సందర్భంగా నగరంలోని రోడ్లన్నీ జనంతో కిక్కిరిసి పోయాయి. ప్రధాన రహదారుల మీదుగా ఊరేగింపులు కొనసాగించిన నిర్వాహకులు తాము ప్రతిష్ఠించిన విగ్రహాలను స్థానిక ఖాసభావి వద్ద నిమజ్జనం చేవారు. ఈ బావి వద్ద నగరసభ యంత్రాంగం పూర్తిగా ఏర్పాట్లు చేయగా ఊరేగింపుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా స్థానిక గాజగారపేటకు చెందిన మండపం వినాయకుడి ఊరేగింపు స్థానిక మామిడి చెరువు వద్ద సాగుతుండగా ఘర్షణ నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి స్వల్పంగా లాఠీచార్జి చేశారు. అనంతరం అన్ని ఊరేగింపు రథాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నిమజ్జనం సాఫీగా జరిగేలా పోలీసులు చర్యలు చేపట్టారు.


చాకుతో బెదిరించి నగదు దోపిడీ!

రాయచూరు సెప్టెంబర్ 12 :నగరానికి చెందిన రైస్ మిల్ యజమాని ఒకరిని నగర సమీపంలోని వైటీపీఎస్ సమీపంలో దుండగులు చాకుతో బెదిరించి రూ.50వేల నగదును దోచుకున్నారు. అంతేకాదు ఆయనను వెంబడించి కిడ్నాప్ చేసే ప్రయత్నం చేస్తు సినిమా స్టైల్‌లో బెదిరింపులకు పాల్పడ్డారు. మరింత సొమ్ము ఇవ్వాలని లేదంటే హతం చేస్తామంటు బెదిరించారు. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సీసీ కెమెరాల ఆధారంగా కారుజాడను కనుకున్న రూరల్ ఎస్ఐ ప్రకాశ్ రెడ్డి డంబళ్ నేతృత్వంలోని పోలీసుల బృందం ఐదుగురుదుండగులను అదుపులోకి తీసుకున్నారు. దుండగుల్లో దొడ్డగురు, సణ్ణగురు, రియాజ్, అబ్దుల్ మరొకడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై రాయచూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

రోల్డ్ డాల్ (జయంతి)



బ్రిటీష్ నవలా రచయిత, చిన్న కథల రచయిత రోల్డ్ డాల్ 1916 సెప్టెంబరు 13న జన్మించారు. కవిగా, స్క్రీన్ రైటర్‌గా రాణించారు. 20వ శతాబ్దంలో పిల్లల కథలు చెప్పడంలో పేరొందారు. రెండో ప్రపంచయుద్ధంలో రాయల్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేశారు. ఆయన రచనలు ప్రపంచవ్యాప్తంగా 250 మిలియన్ లకుపైగా అమ్ముడయ్యాయి. 'వరల్డ్ ఫాంటసీ అవార్డ్ ఫర్ లైఫ్ అచీవ్‌మెంట్, బ్రిటీష్ బుక్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. 1990 నవంబరు 23న కన్నుమూశారు.

మణక్కల్ రంగరాజన్ (జయంతి)



కర్ణాటక సంగీత గాయకులు మణక్కల్ రంగరాజన్ 1922 సెప్టెంబరు 13న తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి జిల్లా మణక్కల్ ప్రాంతంలో జన్మించారు. అరుదైన రాగాలు, పల్లవిలు ఆలపించడంలో నిష్ణాతులు. 60 ఏళ్ళపాటు త్యాగరాజ సంగీత ఉత్సవంలో కృతులు ఆలపించారు. ఆలిండియా రేడియో చెన్నైలో నాన్‌స్టాప్‌గా పాటలు పాడారు. కళైమామణి, గాన కళారత్న, గానకళా సాగర, ఉగాది పురస్కార్, గాయక సామ్రాట్ వంటి పురస్కారాలు పొందారు. 2019 ఫిబ్రవరి 26న కన్నుమూశారు.

ఆత్రేయ (వర్ధంతి)




'మనసు కవి'గా పేరొందిన ఆచార్య ఆత్రేయ 1921 మే 7న నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట మండలం మంగళంపాడులో జన్మించారు. ఆయన అసలు పేరు కిళాంబి వెంకట నరసింహాచార్యులు. తెలుగులో నాటక, సినిమా పాటల రచయిత, నిర్మాత, దర్శకులు. సుమారు 400 సినిమాలకు మాటలు, పాటలు రాశారు. గొప్ప వేదాంతి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆత్రేయ రాసిన రచనలను 7 సంపుటాలలో ప్రచురించిన ఆప్తమిత్రుడు కొంగర జగ్గయ్య ఆయనకు నివాళిగా అర్పించారు. నంది పురస్కార, ఆంధ్ర నాటక పరిషత్ తదితర గౌరవాలు అందుకున్నారు. విశ్వశాంతి నాటకానికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. 1989 సెప్టెంబరు 13న కన్నుమూశారు.

ప్రభా ఆత్రే (జయంతి)



'పద్మభూషణ్' పురస్కార గ్రహీత డాక్టర్ ప్రభా ఆత్రే 1932 సెప్టెంబరు 13న పూనెలో జన్మించారు. హిందూస్తానీ గాయనంలో ప్రత్యేకించి 'కిరానా ఘరానా'లో పేరొందారు. 50 ఏళ్లలో ఆమె పలు కొత్త రాగాలను ఆవిష్కరించారు. ఖ్యాల్ లేదా ఖయాల్, తుమ్రి, దాద్రా, గజల్, గీత్, నాట్యసంగీత్, భజన్ తదితర అన్ని రకాల పాటలు ఆలపించారు. ప్రొఫెసర్‌గా సంగీతంపై 11 పుస్తకాలు రచించారు. గానప్రభ, స్వరమయీ, ఠాగూర్ అకాడమీ రత్న అవార్డ్, కాళిదాస్ సమ్మాన్ పురస్కారాలు అందుకున్నారు. 2024 జనవరి 13న కన్నుమూశారు.

షేన్ వార్న్ (జయంతి)



ఇంటర్నేషనల్ మాజీ క్రికెటర్, ఆస్ట్రేలియా క్రికెట్ కామెంటేటర్, షేన్ కీత్ వార్న్ 1969 సెప్టెంబరు 13న జన్మించారు. వన్డే ఇంటర్నేషనల్స్‌లో ఆస్ట్రేలియన్ నేషనల్ టీమ్‌కు కేప్టెన్‌గా వ్యవహరించారు. క్రికెట్ చరిత్రలో గొప్ప బౌలర్‌గా పేరొందారు. 1994లో 'విజ్డన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, 1997లో విజ్డన్ లీడింగ్ క్రికెటర్ ఇన్ ది వరల్డ్‌గా నిలిచారు. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో వెయ్యి వికెట్లు తీసిన ఘనత ఆయనది. ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేంలో గుర్తింపు పొందారు. ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 2022 మార్చి 4న కన్నుమూశారు. మరణానంతరం 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా' గుర్తింపు ప్రకటించారు.

కిరణ్‌కుమార్ రెడ్డి (పుట్టినరోజు)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చివరి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి 1960 సెప్టెంబరు 13న హైదరాబాద్‌లో జన్మించారు. చిత్తూరు జిల్లా (ప్రస్తుతం అన్నమయ్య జిల్లా) వాయల్పాడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్‌గా, శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించారు. 'మీ సేవ', రాజీవ్ యువకిరణాలు, ఎ స్సీ ఎస్టీ సబ్‌ప్లాన్, బంగారు తల్లి, మన బియ్యం, అమ్మ హస్తం, చిత్తూరు వాటర్ స్కీమ్ వంటి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే. అంతేకాక రాష్ట్రం తరఫున రంజీ క్రికెట్ మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించారు. వివాదాలు లేని రాజకీయ జీవితం, కీలక సందర్భాలలో కఠిన నిర్ణయాలు తీసుకునే మనస్తత్వంతో ఉన్నత హోదాలలో కొనసాగారు. ఇటీవల బీజేపీలో చేరారు.

కర్ణాటకతో ఏచూరికి అనుబంధం

▸▸ పలుమార్లు బెంగళూరు, బాగేపల్లి సందర్శన

బెంగళూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీపీఎం అగ్ర నేత, జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కర్ణాటకతో సుదీర్ఘకాల సంబంధాలు ఉన్నాయి. సీతారాం ఏచూరి కన్నుమూశారనే విషయం తెలియగానే బెంగళూరులోని పార్టీ కార్యాలయాల వద్ద జెండాలను అవనతం చేశారు. ఇదే సందర్భంగా సీతారాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, కార్యవర్గ మండలి సభ్యులు ప్రకాశ్, బయ్యారెడ్డి, వరలక్ష్మి, మీనాక్షి సుందరం, మంగళూరుకు చెందిన యాదవశెట్టితోపాటు పలువురు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఓ లక్ష్యంతో సుదీర్ఘ కాలం వ్యవహరించారన్నారు. దేశంలో ఎక్కడ ప్రజాస్వామ్యానికి భంగం కలిగినా, సామాన్యుడిపై దాడి జరిగినా ఏచూరి స్పందించేవారన్నారు. ఆయన సారథ్యంలో సీపీఎం జాతీయస్థాయిలో మరింత పటిష్ఠమైందన్నారు. పదవుల కంటే పార్టీ సిద్ధాంతాలు, ప్రజా పోరాటాలకే జీవితకాలం పనిచేశారన్నారు. నగరంలోని బసవనగుడిలోని పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కే ప్రకాశ్, మంజునాథ్, కేఎస్ విమల తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లితో ప్రత్యేక అనుబంధం

బాగేపల్లి: రాష్ట్రంలో సీపీఎం ప్రభావం కల్గిన ఏకైక నియోజకవర్గం బాగేపల్లి ఒక్కటే. ఇక్కడికి పలుమార్లు సీతారాం ఏచూరి వచ్చారు. సీపీఎం తరఫున ఎమ్మెల్యేగా రెండు సార్లు ఎన్నికైన శ్రీరామరెడ్డి తరఫున ప్రచారంతోపాటు పలు సభలలోనూ ఏచూరి పాల్గొన్నారు. శ్రీరామరెడ్డి, ఏచూరిల మధ్య సంబంధాలు బాగుండేవి. బాగేపల్లి అంటే సీతారాం ఏచూరికి అత్యంత ఆసక్తి ఉండేది. సీపీఎం భావ జాలం ఈ ప్రాంతంలోని గ్రామాలలోనూ విస్తరించింది. అందుకు శ్రీరామరెడ్డి కృషి మరువలేనిది. ప్రజాపోరాటాలలో నిత్యం ఉంటూ ప్రజాదరణ పొందారు. శ్రీరామరెడ్డి శ్రద్ధాంజలి సభలో పాల్గొనేందుకు ఏచూరి వచ్చారు. అదే బాగేపల్లికి ఏచూరి చివరి పర్యటన. ఏచూరి మృతి పట్ల స్థానిక నాయకులు డాక్టర్ అనిల్‌కుమార్, ఆవులప్ప, చన్న రాయప్ప, ముని వెంకటప్ప, రఘురామరెడ్డి, వాల్మీకి అశ్వత్థప్ప, సావిత్రమ్మ, కరింసాబ్, కృష్ణప్ప తదితరులు సంతాపం తెలిపారు.



బాగేపల్లిలో మాజీ ఎమ్మెల్యే శ్రీరామరెడ్డితో సీతారాం ఏచూరి (ఫైల్)



సీపీఎం జెండాను అవనతం చేస్తున్న నాయకులు



సీతారాం ఏచూరి చిత్రపటాలతో ప్రదర్శన

బెంగళూరుకోసం వంద బస్సులు

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర ప్రజలకు అనుకూలంగా బీఎంటీసీకి 840 బస్సులు మంజూరు చేశామని ఇందులో తొలి విడతగా వంద బస్సులను విడుదల చేస్తున్నట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు. విధానసౌధ తూర్పుగేట్ వద్ద బస్సులను గురువారం జాతికి అంకితం చేశారు. నగర ప్రజల సంచారం పెరిగిందని అందుకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేశామన్నారు. శ్రామికవర్గ ప్రజలకు శక్తి యోజనె ద్వారా ఉచిత రవాణా వెసలుబాటు కల్పించామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా ఉండాలనేది మా ఆశయమన్నారు. కార్యక్రమంలో మంత్రులు రామలింగారెడ్డి, జమీర్ అహ్మద్, కేజే జార్జ్, అజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.





నూతన బస్సు సర్వీసులివే, కొత్త సర్వీసులను ప్రారంభిస్తున్న సీఎం తదితరులు

పోషణ్ అభియానకు ఈఓ గైర్హాజరు



ప్రసంగిస్తున్న మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరి

▸▸ మహిళా కమిషన్ అధ్యక్షురాలు మండిపాటు

బంగారపేట, సెప్టెంబరు 12: తాను పాల్గొనే సభలో అన్నిశాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా ఈఓ గైర్హాజరు కావడం సరికాదని మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరి మండిపడ్డారు. తాలూకాలోని చిక్క అంకండహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని వట్రకుంటె గ్రామంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం, స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన కార్యక్రమం గురువారం ఏర్పాటైంది. ఆమె పాల్గొని మాట్లాడుతూ తాను అధికారం చలాయించేందుకు రావడం లేదని మహిళల్లో ధైర్యం నింపడంతోపాటు వారి ధ్వనిగా నిలిచేందుకు అధికారులు ఎలా పనిచేస్తున్నారని తెలుసుకునేందుకు వచ్చానన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులను సస్పెండ్ చేస్తానన్నారు. తాను రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నా అని కొన్నిచోట్ల అధికారులు ఏదో నెపంతో హాజరు కావడం లేదన్నారు. ముందస్తుగా సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా అందుబాటులో లేకపోవడం సరికాదన్నారు. కోలారు జిల్లా రాయల్పాడు హక్కిపిక్కి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన వేళ గర్భిణీలకు ఎలాంటి సౌలభ్యం కల్పించడం లేదని, పిల్లలకు భోజనం ఇవ్వడం లేదని, ఆరు నెలలుగా కోడిగుడ్లు ఇవ్వడం లేదని, మధ్యాహ్న భోజనం కూడా లేదని గుర్తించినట్టు తెలిపారు. మహిళలకు తమ హక్కులపై జాగృతి కల్పించడమే ఉద్దేశ్యమన్నారు. అత్యవసర వేళ మహిళలు తమ రక్షణకోసం 112కు ఫోన్ చేయడం ద్వారా పోలీసుల సాయం పొందవచ్చునన్నారు. ఇదే సందర్భంగా గ్రామంలోని గర్భిణీకి సీమంతం నిర్వహించడంతోపాటు ఏడాది పూర్తి చేసుకున్న చిన్నారులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు గిరిజమ్మ, మహిళా సంఘం అధ్యక్షురాలు గీతా, డిడి నారాయణస్వామి, డీహెచ్‌ఓ శ్రీనివాస్, టీహెచ్‌ఓ సునిల్, సీడీపీఓ మునిరాజు, మాజీ అధ్యక్షుడు హరీశ్‌కుమార్, కన్నడ పోరాట నాయకుడు వెంకటప్ప, అంజలి, ప్రేమ, అనితా, చంద్రణ్ణ తదితరులు పాల్గొన్నారు.

మండూరు గ్రామ పంచాయతీ సభ

మహదేవపుర, సెప్టెంబరు 12: నియోజకవర్గంలోని మండూరు గ్రామపంచాయతీ సభ 2024-25 వార్షిక తొలి గ్రామసభను ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి ప్రారంభించారు. గురువారం ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధిని ప్రస్తావిస్తూ నిర్వహించాల్సిన పలు పనుల గురించి వివరించారు. రెవెన్యూ, సాంఘిక సంక్షేమ, ఉద్యానవనాలు, వ్యవసాయం, పట్టు, పౌర ఆహార సరఫరాలు, స్త్రీ శిశుసంక్షేమ, విద్య, విద్యుత్ తదితరశాఖల అధికారులు పాల్గొని ఆయా శాఖల ద్వారా ప్రజలకు కల్పిస్తున్న పథకాల గురించి వివరించారు. ఇదే సందర్భంగా ప్రజలనుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లబ్ధిదారులకు ట్రాక్టర్‌కు అనుబంధమైన టిల్లర్‌ను అందచేశారు. సమావేశంలో మండూరు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు గురురాజ్, ఉపాధ్యక్షురాలు శ్వేతా మునేగౌడ, పీడీఓ నాగేశ్, గ్రామ పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో లబ్ధిదారుడికి టిల్లర్ అందజేత



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం తదితరులు

చిన్నారులను సాంస్కృతికంగా ప్రోత్సహించాలి

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను సాంస్కృతిక రంగంలోనూ ప్రోత్సహించాలని తద్వారా మన సంప్రదాయం, సంస్కృతితోపాటు జాతీయ నేతలను స్మరించుకునేందుకు వీలుంటుందని దక్షిణ విభాగం విద్యాశాఖ అధికారి శశికళ అభిప్రాయపడ్డారు. వివేక్‌నగర్‌లోని కన్నడ తెలుగు పాఠశాలలో గురువారం ప్రతిభాకారంజి పోటీలు జరిగాయి. ఉత్తమంగా రాణించినవారికి విద్యాశాఖ సమన్వయ అధికారి చందప్ప, ఆస్టిన్‌టౌన్ క్లస్టర్ సిఆర్‌పి సుమంగళ భైరిశెట్టిలు అభినందించి ప్రశంసాపత్రాలు అందచేశారు. సేవాభారత్ ట్రస్టు సంచాలకులు రంగస్వామి నాయుడు, పాఠశాల హెడ్మాస్టర్ తిప్పేస్వామి పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అటవీసాగుపై ప్రత్యేక శిబిరం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 12: శిడ్లఘట్ట తాలూకాకు చెందిన రైతు సంఘాల సమాఖ్య, కర్ణాటక రాష్ట్ర యువజన రైతు సంఘానికి చెందిన 55మంది రైతులు, మహిళా రైతులు 'అటవీ సాగులో రైతుల పాత్ర' అనే అంశంపై మలెమహదేశ్వర కొండపై నిర్వహించిన శిబిరంలో పాల్గొన్నారు. కొళ్లేగాల వ్యవసాయశాఖ సహాయక డైరెక్టర్ రంగస్వామి, వ్యవసాయ శాఖకు చెందిన నిశాంత్‌లు పలు అంశాలను వివరించారు. చింత, వేప, నేరేడు తదితర అటవీ సాగుకు సహాయధనం లభిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కర్ణాటక రాష్ట్ర యువజన రైతు సంఘం మాజీ అధ్యక్షుడు బి.వి.మంజునాథ్ మాట్లాడుతూ ఎర్రచందనం, వేప, శ్రీగంధం, నేరేడు, ఆస్ట్రేలియన్ సిల్వర్ ఓక్ తదితర చెట్ల పెంపకంతో చక్కటి గాలి, పర్యావరణం సాధ్యమన్నారు. శిబిరంలో రైతుసంఘానికి చెందిన హిత్తలహళ్ళి గోపాలగౌడ, సిరి సమృద్ధి రైతుసమాఖ్య అధ్యక్షుడు బోదగూరు వెంకటస్వామిరెడ్డి, రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



మహదేశ్వర కొండపై శిబిరంలో తాలూకా రైతుల బృందం

సాయిబాబా మందిర వార్షికోత్సవం



షిర్డీ సాయిబాబా

శిడ్లఘట్ట, సెప్టెంబరు 12: పట్టణంలోని సాయినాథ జ్ఞాన మందిరం 19వ వార్షికోత్సవం గురువారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. గోపూజ, గంగాపూజ, పుణ్యాహవచనం, రక్షా బంధన్, కళశారాధాన, వాస్తు, ఇతర హోమాలు, మహా మంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. శుక్రవారం లక్ష్మీనారాయణ హృదయ హోమం, పూర్ణాహుతి, శనివారం ఉదయం షిర్డీ సాయిబాబాకు పంచామృతాభిషేకం చేయనున్నారు.

హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లో తెలుగు రుచులు



ప్రారంభంలో సురేశ్ తదితరులు

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 12: నియోజకవర్గంలోని హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్ 27వ మెయిన్‌రోడ్డు సెక్టర్ పీడబ్ల్యూడీ క్వార్టర్స్ సమీపాన ఆంధ్రశైలి, తెలంగాణతో కూడిన అన్నయ్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. గురువారం లాంఛనంగా ప్రారంభించారు. తెలుగు రుచులను ఇక్కడ అందిస్తున్నట్టు సంస్థాపకుడు సురేశ్ ముప్పాల తెలిపారు. పొడులు, పచ్చళ్లతో పాటు సొంతంగా మసాలాలతోపాటు వంటలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ బిరియాని, తెలంగాణ ఫిష్, ఊరగాయలు, శాకాహారంలో పప్పు, రసం ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రుచులను ఇక్కడి వారికి పరిచయం చేస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే మరిన్ని శాఖలు ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు.

ఇల్లు కూలుస్తుండగా ఇద్దరి దుర్మరణం

● దక్షిణ కన్నడ జిల్లాలో ప్రమాదం



పైకప్పు కూలిన ప్రదేశం, ఇన్‌సెట్లో మృతులు (ఫైల్)

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కన్నడ జిల్లా కేంద్రం మంగళూరులోని కరంగల్‌పాడి సీజే కామత్ రోడ్డులో గురువారం పాత ఇంటిని కూలుస్తుండగా ఇద్దరు కూలీలు సజీవ సమాధి అయ్యారు. మృతులను జేమ్స్ జత్తణ్ణ (35), అడ్విన్ జిరాల్డ్ మోబిన్ (44)లుగా గుర్తించారు. ఇల్లు కూలుస్తుండగా ఒక్కసారిగా పైకప్పు కూలి మీదపడ్డంతో ఇద్దరు ఇరుక్కుపోయారు. వెంటనే స్థానికులు గుర్తించి తొలగించి వారిని రక్షించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఇద్దరూ శిథిలాల కిందనే మృతి చెందారు. కాంట్రాక్టర్‌పై కద్రి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

అమ్మ ఆశీస్సులు పొందిన గవర్నర్

వేలూరు, సెప్టెంబరు 12: స్థానిక శ్రీపురంలోని స్వర్ణాలయాన్ని ప్రతిరోజు వేలాది మంది సందర్శిస్తుంటారు. కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ గురువారం కుటుంబ సభ్యులతో స్వర్ణాలయాన్ని సందర్శించారు. గవర్నర్‌కు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం గవర్నర్ శక్తి అమ్మ ఆశీస్సులు అందుకున్నారు.



ఆశీస్సులు పొందుతున్న గవర్నర్ గెహ్లాట్

రక్తమోడిన భాకరాపేట ఘాట్

● తిరుమల నుంచి తిరిగివెళ్తూ ప్రమాదంలో ● ప్రాణాలు కోల్పోయిన చిక్‌బళ్ళాపురవాసులు

చంద్రగిరి, సెప్టెంబరు 12: తిరుపతి-మదనపల్లె రహదారిలోని భాకరాపేట ఘాట్ మరోసారి రక్తమోడింది. తరచూ ప్రమాదాలతో వార్తల్లో వుండే ఈ రోడ్డులో గురువారం జరిగిన అనూహ్య సంఘటనతో కర్ణాటక వాసులు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.పోలీసుల కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం, చిక్‌బళ్ళాపుర సమీపంలోని హరిస్థలకు చెందిన తేజస్ కుమార్(35) తన తండ్రి మునివెంకటరెడ్డి(55), బావమరిది మంజునాథ(38)తో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్ళి గురువారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. గోలచిందెనహళ్ళికి చెందిన రమేష్‌మూర్తి(34) కారు నడుపుతున్నాడు. 2గంటల సమయంలో భాకరాపేట ఘాట్ రోడ్డులో వెళ్తుండగా కలకడ నుంచి చెన్నైకి టమోటాలను తీసుకెళ్తున్న కంటైనర్ మలుపు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వీరి కారుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయిపోయింది. సమాచారం అందుకున్న చంద్రగిరి, భాకరాపేట సీఐలు సుబ్బరామిరెడ్డి, ఇమ్రాన్‌బాషా, కళ్యాణి డ్యామ్ వద్ద వున్న పోలీసు శిక్షణ కళాశాల ఎస్ఐలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.పొక్లయినర్‌తో కంటైనర్ కింద వున్న కారును బయటకు తీసేందుకు సాధ్యం కాకపోవడంతో తిరుపతి నుంచి ఒక క్రేన్, భాకరాపేట నుంచి మరో క్రేన్ రప్పించారు.ఈ లోపు పోలీసులతో పాటు ఆ దారిలో వెళుతున్న వాహనదారులు కంటైనర్‌లో ఉన్న టమోటా బాక్సులను బయటకు తీశారు. మూడు గంటల సమయంలో క్రేన్ సాయంతో కంటైనర్‌ను అతి కష్టంపై పైకి తీసి, కారులోంచి కేకలు వేస్తున్న తేజస్ కుమార్‌ను బయటకు తీశారు.చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.కారులోనే ఇరుక్కుపోయి మృతి చెందిన రమేష్‌మూర్తి, మంజునాథ, మునివెంకటరెడ్డి మృతదేహాలను బయటకు తీశారు.ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ నర్సింగప్ప సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.తరచూ ఇదే ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్న ఎస్పీ జాతీయ రహదారి అధికారుల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలను చేపడతామని తెలిపారు. కాగా కంటైనర్ డ్రైవర్ అల్లాహుద్దీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఐదు కిలో మీటర్ల దూరం స్తంభించిన ట్రాఫిక్

భాకరాపేట ఘాట్‌లో ఈ ప్రమాదంతో సుమారు ఐదు కిలో మీటర్ల దూరం వాహన రాకపోకలు స్తంభించి పోయాయి.కంటైనర్ కింద కారులోని మృత దేహాలను బయటకు తీయడానికి సాయంత్రం 4గంటలైంది.తరువాత కంటైనర్‌ను పక్కకు తీసి, వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు.ఆ లోపు తిరుపతి నుంచి మదనపల్లె, పీలేరుకు వెళ్ళే వాహనాలను చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట నుంచి నారావారిపల్లె, కొత్తపేట మీదుగా భాకరాపేటకు పంపించారు.మరికొన్ని వాహనాలను ఎ.రంగంపేట నుంచి ఐతేపల్లె,దామలచెరువు మీదుగా పీలేరుకు పంపించారు.



కారుపై పడిన లారీ

మృత్యువాత పడిన కర్ణాటక వాసులు





కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేశ్

జర్నలిస్టుల సేవలు అమోఘం

● డీఎస్పీ వెంకటేష్

సిరుగుప్ప, సెప్టెంబరు 12 : జర్నలిస్టుల సేవలు ఎంతో అమోఘమని డీఎస్పీ వెంకటేష్ తెలిపారు. సిరుగుప్ప పట్టణం శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో గురువారం సిరుగుప్ప తాలుకా జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు నౌషద్ అలీ అధ్యక్షతన విలేకరుల దినోత్సవం నిర్వహించారు. మొక్కలకు నీరు పోయడం ద్వారా డీఎస్పీ వెంకటేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో, దేశాభివృద్ధిలో వారి పాత్ర ఎంతో వుందని తెలిపారు. అక్షరమే ఆయుధమన్నారు.